గ్రామస్వరాజ్యం సాకారం

- అన్ని వర్గాలకు సమన్యాయం
- అందుకే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



జేవీ అగ్రహారం వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ఐనాడలో సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



బోనిలో లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోనిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో పంచాయతీలో ఒకే ఒక భవనం, ఒక అధికారే ఉండేవారని దీంతో ఏ సమస్య వచ్చినా మండల కార్యాలయం లేదా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లవలసి వచ్చేదన్నారు. కానీ నేడు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం వలన అన్ని వ్యవస్థలకు సంబంధించిన అధికారులు స్థానికంగా ఉంటూ అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుండడంతో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. బోని సచివాలయ పరిధిలో సంక్షేమానికి రూ.25 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.6 కోట్లు చొప్పున వెచ్చించామన్నారు. పార్టీ జెండాను.. అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ఎంపీపీ పాండ్రంకి శ్రీను, స్థానిక సర్పంచ్ బోని అప్పలకొండ, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్‌చైర్మన్ బోని అప్పలనాయుడు, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, సర్పంచ్‌లు కర్రి నాయుడుబాబు, అప్పలరాజు, నాయకులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నదే..

కొమ్మాది: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిదే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఇంటికి బాధ్యత గల బిడ్డలా ఉంటూ, సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తున్నందునే మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాలరమణారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బోర రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడిదబోయిన రాములప్పడు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో అగ్రగామి ఏపీ

పద్మనాభం: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఐనాడలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను సీఎం జగన్ అందజేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో రూ.4లక్షల 70వేల కోట్లు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. ముందుగా నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజుతో కలిపి పార్టీ జెండా ఎగరవేశారు. సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ఆవిష్కరించారు. వై ఏపీ నీడ్స్ జగన్ బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు మామిడి శివరామకృష్ణ, కోరాడ పాపారావు, సూర్యనారాయణ, శ్రీను, సన్యాసినాయుడు పాల్గొన్నారు.



అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో వైఎస్సార్‌సీపీ పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

మత్స్యకారులకు గౌరవం ఇచ్చిన సీఎం జగన్

తగరపువలస: దేశంలోనే మత్స్యకారులకు అరుదైన గౌరవం ఇచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగరవేసి పంచాయతీ ప్రజలతో మాట్లాడారు. మత్స్యకారులకు రాజ్యాంగ పదవులైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి, రాజ్యసభ వంటి సభలకు పంపించారని గుర్తు చేశారు. డీజిల్ సబ్సిడీ, వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సరే 23 రకాల సంక్షేమ పథకాలను కరోనా వంటి విపత్తు సమయంలో కూడా ఆపలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, సర్పంచ్ మేరుగు సంతోషికుమారి, ఎల్లాజీ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీలు సురపతి దుర్గాలమ్మ, బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, మండల సచివాలయాల కన్వీనర్ ఎస్. రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్షయపాత్రను సందర్శించిన విద్యార్థులు



జగనన్న గోరుముద్ద మెనూను విద్యార్థులకు వివరిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధి

ఆనందపురం : మండలంలోని గంభీరంలో ఉన్న అక్షయపాత్ర ఫౌండేషన్ భోజనశాలను పోలాక్స్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. అక్కడ తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అధునాతన వంట యంత్ర సామగ్రి గురించి విద్యార్థులకు అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు వివరించారు. జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజన పథకం)మెనూ వివరాలను విద్యార్థులు పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగరంపాలెంలో పశువైద్య శిబిరం

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు నగరంపాలెంలో భారత్ వికాస్ పరిషత్ ఝాన్సీలక్ష్మీబాయి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.చంద్రంపాలెం పశువైద్య కేంద్రం వైద్యాధికారి అనుపమ ఆధ్వర్యంలో సిబ్బంది పశువులకు నట్టల నివారణ మందులు అందజేసి, చూడి తనిఖీలు నిర్వహించారు. నిర్వాహకులు సత్యశ్రీ , విశాఖ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ అండ్ కేర్ ఆఫ్ యానిమల్స్ (వీఎస్‌పీసీ) ప్రొఫెసర్ డాక్టర్ ఉషాబీరా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మందులు, ఖనిజ లవణాలు మిశ్రమం ప్యాకెట్లు ఉచితంగా అందజేశారు.

లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

ఆనందపురం : కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద మంజూరైన గ్యాస్ కనెక్షన్లను శుక్రవారం వెల్లంకిలో లబ్ధిదారులకు బీజేపీ నాయకులు పంపిణీ చేశారు.పెద్దిపాలెం, ముకుందపురం, గొట్టిపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు వంద మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్ కింద గ్యాస్ పొయ్యి, సిలిండర్ అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య, కిసాన్ మోర్చా విశాఖ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల రామునాయుడు, ధర్మావతి పాల్గొన్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ లేబర్ కమిషనర్ బీవీ రమణరాజు పాల్గొన్నారు.

'చెకుముకి' టాలెంట్ టెస్ట్‌కు 300 మంది హాజరు



పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ఆనందపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోటీ పరీక్ష నిర్వహించారు. సామాన్య శాస్త్రంలోని వివిధ అంశాలపై నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో 8,9,10 తరగతులకు చెందిన సుమారు మూడు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన ముగ్గురు విద్యార్థులు ఈ నెల 30న మండల స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కన్వీనర్ పెద్దింటి త్రినాథరావు, హెచ్ఎం బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ బృందం 'కేజీబీవీ' సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న అమెజాన్ కేంద్ర బృంద సభ్యులు

ఆనందపురం : మండలంలోని నేళ్తేరులో ఉన్న కేజీబీవీని శుక్రవారం అమెజాన్ కేంద్ర బృందం సందర్శించింది. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో వ్యవస్థాపక మనస్తత్వాన్ని అలవర్చేందుకు అమెజాన్ దేశవ్యాప్తంగా కార్యక్రమం అమలు జరుపుతోంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆలోచనా విధానంలో వచ్చిన మార్పులు, పెంపొందిన సామర్థ్యం అంచనా వేసేందుకు అమెజాన్ బృందం జిల్లాలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా నేళ్తేరు కేజీబీవీని సందర్శించిన బృంద సభ్యులు విద్యార్థుల సృజనాత్మకత, ప్రాజెక్టులు తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ బృంద సభ్యుడు సారాహుస్సేన్, లీడ్ ఏపీ సభ్యుడు జి.జయవర్ధన్, చాగంటి బ్రహ్మం, కాకర సురేష్, కేజీబీవీ ప్రత్యేకాధికారి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారికి రూ.5 వేల జరిమానా

సాక్షి ఎఫెక్ట్..



మాంసం వ్యాపారి షేక్ సలీం నుంచి రూ.5 వేలు ఫైన్ వసూలు చేస్తున్న సచివాలయ కార్యదర్శులు

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు వేంకటేశ్వరమెట్ట జాతీయ రహదారిని ఆనుకుని ఫుట్‌పాత్ పక్కన గురువారం సాయంత్రం మాంసం వ్యర్థాలు పడేసిన వ్యాపారి షేక్ సలీంను సచివాలయ శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు గుర్తించారు. 'రోడ్ల పక్కన పశు మాంస వ్యర్థాలు'శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు వారు స్పందించారు. వార్తలో ప్రచురించిన ఫొటోల ఆధారంగా భీమిలి జెడ్సీ బి.రాము, రెండో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బొట్ట శ్రీకాంత్ సూచనలతో మాంసం వ్యాపారి నుంచి రూ. 5 వేలు ఫైన్ వసూలు చేశారు. ఇకపై బహిరంగ ప్రదేశాలలో మాంసం వ్యర్థాలు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యదర్శులు అఖిల్, సురేష్, మనోజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను రోడ్లు, చెరువుల్లో వేయరాదు

కొమ్మాది : ప్రజలు వ్యర్థాలను రోడ్లపై, చెరువులు, సముద్రాల్లో వేయవద్దని భారతీయ జనతా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. శుక్రవారం రుషికొండ బీచ్ వద్ద సాగర జలాల్లో స్కూబా డైవర్ సుభాష్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సాగర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సుభాష్ బృందం అనేక సంవత్సరాలుగా ఈ కార్యక్రమం చేపడుతుందని, గతంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ బృందాన్ని అభినందించారని తెలిపారు. వ్యర్థాల వల్ల సాగర జలాలు కలుషితమై మత్స్యకారులు, మత్స్య సంపదకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు.

చక్కటి బోధనతో మెరుగైన ఫలితాలు



కళాశాల లోగోను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

భీమునిపట్నం: అధ్యాపకులు పాఠ్యాంశాలను ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తే చక్కటి ఫలితాలు వస్తాయని, తమ కళాశాల అధ్యాపకులు ఆ విధంగానే విద్యార్థులకు బోధిస్తారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అన్నారు. శుక్రవారం కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో పాల్గొన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఇక్కడ నిపుణులైన అధ్యాపకులు, చక్కటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



టీడీపీ నాయకుడు తాతారావును వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

మధురవాడ : మధురవాడ టీడీపీ సీనియర్ నాయకులు సత్యాల తాతారావు, బెవర అప్పలరాజు వారి అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులకు రు. 3.67 కోట్లు మంజూరు అయ్యాయని, 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు సంక్షేమ బావుటా పత్రాలు అందజేశారు. మాజీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, జేఎస్ కన్వీనర్లు పోతిన సురేష్‌కుమార్, కుడితి రామారావు, జేఎస్ రెడ్డి, పీకేఎం పాత్రుడు, నాగోతి చిన్న, కొరగంజి నాని, వాండ్రాసి శివ, నాగోతి జ్యోతిష్, బోర శ్రీను, ముచ్చి రామారావు, బోయి సూర్రెడ్డి, రిషికేష్, బండారు శివలక్ష్మి, రజని, గాయత్రి, సీత, వంకర అప్పారావు, కావ్యరెడ్డి, దేవా తదితరులు పాల్గొన్నారు.

కేపీకి ఎమ్మెల్యే ముత్తంశెట్టి పరామర్శ

తగరపువలస : భీమిలి మండలం శింగనబంద పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేపీ సత్యనారాయణను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరామర్శించారు. ఇటీవల కేపీ అస్వస్థతకు గురయి ఇంటికే పరిమితం కావడంతో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో కోలుకుని పార్టీకి సేవలందించాలని కోరారు. ఆయన వెంట దాట్ల పెదబాబు కూడా ఉన్నారు.

కుంతీ మాధవస్వామికి పవిత్రాల సమర్పణ



పవిత్రాలతో కుంతీ మాధవ స్వామి

పద్మనాభం: మండలంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న అనంతుని పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణాల నడుమ పవిత్రాలను స్వామికి సమర్పించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. తదుపరి కుంతీ మాధవ స్వామి, అనంత పద్మనాభ స్వామికి అష్టకలశస్నపనం, పంచామృత అభిషేకాలు జరిపారు. తరవాత తమిళనాడు రాష్ట్రం శ్రీరంగం నుంచి తీసుకు వచ్చిన పవిత్రాలతో వేద పండితులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పవిత్రాలను కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, కొండపై ఉన్న అనంత పద్మనాభ స్వామిలకు సమర్పించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, ఎద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

అకుంఠిత దీక్షతో సులభంగా లక్ష్యసాధన



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఏసీపీ శివరామిరెడ్డి

తగరపువలస : చేసే పని ఏదైనా దానిని సాధించడానికి అకుంఠిత దీక్ష అవసరమని మధురవాడ జోన్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి అన్నారు. శుక్రవారం చెరకుపల్లి అవంతి డిగ్రీ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డీవీస్ జనరల్ మేనేజర్ ఎం.ఎస్.ఎన్.రావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేపడుతున్న ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అవంతి విద్యా సంస్థల డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ పిన్నింటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేటకు చెందిన నందిక శ్రీలక్ష్మికి శుక్రవారం గ్రామ సచివాలయ సిబ్బంది వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ సాయం అందించారు. ఇటీవల ఆమె భర్త రమేష్ మరణించడంతో ఈ బీమా సొమ్ము అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు బోని సన్నిబాబు, వార్డు సభ్యుడు అక్కరమాని అప్పలనాయుడు, కార్యదర్శి కీర్తి ప్రసాద్, సచివాలయ అడ్మిన్ దివ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి సంబరాలు



విద్యార్థులు పువ్వులతో వేసిన రంగవల్లిక

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు శుక్రవారం ముందస్తుగా దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మతాబులు కాల్చారు. చిన్నారులు పూలతో వేసిన రంగవల్లికలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ మంగలక్ష్మి దీపావళి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దచెరువులో వ్యర్థాల తరలింపుపై రైతుల ఆందోళన

తగరపువలస : చిట్టివలస పెద్ద చెరువులోకి సంతపేట, నమ్మివానిపేట తదితర గ్రామాల నుంచి నేరుగా మురుగునీటిని మళ్లించడం, చెరువులో సాగు చేస్తున్న చేపలకు హానికరమైన ఆహారాన్ని ఇవ్వడం వలన తరచూ దుర్గంధంతో పాటు చెరువును ఆనుకుని సాగు చేస్తున్న పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం వీరు చెరువు పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, రైతులు దుంప శంకరరావు, చేట్ల ఎర్రయ్య, త్రినాథరెడ్డి, అప్పలరెడ్డి, సతీష్‌కుమార్, అప్పలసూరమ్మ, నరసింగరావు, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు జీరు వెంకటరెడ్డి, శిల్లా వంశీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెప్సీ ఫీడర్ ఏరియాలో విద్యుత్ లైన్లు షిఫ్టింగ్ పనులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విశాఖ జోన్-3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ప్రకటించిన సమయంలో బాబానగర్, విజేతా సూపర్ మార్కెట్ ఏరియా, కారుషెడ్ ఏరియా, 45వ సచివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

హుండీ చోరీ

ఆనందపురం: పాలవలస పంచాయతీ మెట్టమీదపాలెం గ్రామ శివాలయంలో గురువారం రాత్రి 11 నుంచి 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హుండీ పగులగొట్టి అందులోని రూ. 9 వేల పైచిలుకు నగదు అపహరించారు. ఆలయ అర్చకుడు అంపోలు విశ్వ సాయికిరణ్ ఫిర్యాదు ప్రకారం ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

తగరపువలస : బాలల దినోత్సవం సందర్భంగా మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చిట్టివలస, ఆనందపురం జెడ్పీ హైస్కూళ్లలో 7,8 తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. 8 జట్లుగా విద్యార్థులను విభజించి ఈ పోటీలు నిర్వహించారు. సంస్థ ట్రైనింగ్ కమ్ మానిటరింగ్ అధికారి దూడ రమేష్, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు శారద, రమ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వాచ్‌మన్ మృతి

తగరపువలస : జాతీయ రహదారిపై వెంకటేశ్వరమెట్ట వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొని ఊడికల పైడిరాజు (61) అనే వాచ్‌మన్ మృతి చెందారు. జీవీఎంసీ ఒకటో వార్డు కొండపేటకు చెందిన మృతుడు విధులకు హాజరయ్యేందుకు రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి విజయనగరం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పైడిరాజును సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విద్యుద్దీపాలు లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధిగా చెత్తను క్లాప్ వాహనాలకు ఇవ్వాలి

తగరపువలస : వీధుల్లోకి వచ్చే క్లాప్ వాహనాలకు విధిగా ఇళ్ల యజమానులు చెత్తను అందించాలని భీమిలి జెడ్సీ బి.రాము సూచించారు. శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా సంగివలస సుభీభవ కాలనీలో ఆయన పర్యటించి తడి, పొడి, ప్రమాదకరమైన చెత్త గురించి అవగాహన కలిగించారు. పారిశుధ్యానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు సమస్యలను జెడ్సీ దృష్టికి తీసుకురాగా ఆయన అక్కడికక్కడే పరిష్కారాలు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానికులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గీతం విద్యార్థులకు ఫెడరల్ బ్యాంక్ ఆఫర్

కొమ్మాది : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ప్రాంగణ నియామకాల్లో శుక్రవారం ఫెడరల్ బ్యాంక్ గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులను భారీ వేతనంతో ఎంపిక చేసుకుంది. ఎంబీఏ ఆఖరి సంవత్సరం చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఫెడరల్ బ్యాంక్ రూ. 14.38 లక్షలు వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసిందని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీ కిరణ్ సోమయాజులు తెలిపారు. డెలాయిట్, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, టాటా ఏఐజీ సంస్థలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో మరో 27 మంది ఎంపికైనటు తెలిపారు.

ఆటోడ్రైవర్లు బాధ్యతగా ప్రవర్తించాలి

భీమునిపట్నం : భీమిలి పరిధిలోని ఆటో డ్రైవర్లందరు బాధ్యతగా ప్రవర్తించాలని క్రైం ఎస్ఐ సూర్యప్రకాశ్ అన్నారు. శుక్రవారం ఆటోడ్రైవర్లకు క్రైం స్టేషన్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోలు ఎక్కే ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా వస్తువులు, బ్యాగ్‌లు ఆటోల్లో మర్చిపోతే వెంటనే తమకు అందివ్వాలన్నారు.

33 బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు

మధురవాడ : జోన్-2 పరిధిలోని వివిధ ప్రాంతాలలో 33 బాణసంచా స్టాల్స్ ఏర్పాటుకు విక్రయదారులు దరఖాస్తు చేసుకున్నట్టు జీవీఎంసీ అధికారులు తెలిపారు. వీటిలో కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డు-24 , వాంబే కాకాలనీ-2 , ఎంవీపీ సిటీ-5 , యండాడ-2 ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే కొమ్మాది ఓజోన్ వ్యాలీ రోడ్డులో కనీస నిబంధనలు పాటించకుండా ఓ ప్రైవేటు కళాశాల, పెట్రోల్ బంక్ సమీపంలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు విమర్శలు వస్తున్నాయి.